


# ఆ దొంగసొమ్ము నీకెందుకు

డా. పి. నరసింహారెడ్డి

సుబ్బయ్య మొగం కళకళ్లాడిపోతోంది, కదిరి పున్నమి పిండిఆరబిల్లిలా, పండు వెన్నెల్లా నవ్వుల పువ్వులు.

ఆనాడే దసరా. అప్పుడే కొనుక్కొచ్చిన కొత్తసైకిల్ టైర్లకు అంటిన దుమ్మును జాగ్రత్తగా తన పాత జరీదైన చొక్కాతో (అది పూర్వాశ్రమంలో అత్తగారు పెండ్లిలో పెట్టిన కొత్త చొక్కా) తుడిచాడు. 'మడ్‌గార్డ్స్' మీద పడిన దుమ్మును తిరుపతి రోడ్లనూ, లారీలనూ బండబూతులు తిట్టుకుంటూ 'క్లీన్' చేశాడు. సైకిలు చైనుకూ తడి తరాలైన సైకిలు కిళ్ళకూ వందగ్రాముల కొబ్బరినూనె పట్టించి తళతళ్ళాడించాడు.

"ఒహో! తన 'హంబర్' సైకిలు, విత్ మిల్లర్ డైనమో, పీనవ్ ఫుల్‌చెయిన్ గార్డ్, క్రోమ్ స్టీల్ స్పోక్స్, బ్రూక్సు సీటూ, వెస్టర్న్ డబుల్‌లాక్, స్టీల్ క్యారియరు, బేబీ సీటూ — అన్నీ 'ఏ వన్' పార్ట్స్ వేయించాడు డబ్బుమొగం చూడకుండా.

ఎంత అందంగా ఉంది కొత్త పెళ్ళి కూతుర్లా! తళతళ్ళాడ్తూ పెళపెళ్లాడ్తూ. ఎనిమిదొందలు అయితే అయింది గాక!

తను ఇంతటి, ఇలాంటి ఆనందాన్ని ఒకే ఒక్కసారి అనుభవించాడు. శోభనం

గదిలో పెళ్ళాన్ని పక్కనుంచా మాసు కొన్నప్పుడు — కలలు పండించు కొన్నప్పుడు.

తన కల చాన్నాళ్ళకు - కాపురాను. చాలా ఏళ్ళకు ఫలించింది. ఈ సైకిల్లో సగభాగం అర్ధాంగిది. ఆమె, పాపం.... చెమటోడ్చి, పూలు మాలలుగా కట్టి, కన్నీ కాయలు కాచేలా 'ప్లాస్టిక్ బుట్ట'లల్లి సంపాదించిన నాలుగొందలూ....

తను చద్దీ, చెడీ, కాయంగల చిన్న పాలుగా నెలనెలా పది రూపాయలు చీటీ కట్టి సంపాయించిన సొమ్మూ —

వెరసి 'హంబర్' సైకిలుగా రూపు దాల్చింది.

సుబ్బయ్య దాదాపు దశాబ్దమున్నర నుంచీ దినమూ రెండుమైళ్ళు పోనూ, రెండుమైళ్ళు రానూ, నడిచి వెళ్ళి మున్సిపాల్టీ ఎలిమెంటరీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వెలగబెడుతున్నాడు.

హంబరు' సైకిలు తప్ప మరొకటి కొనకూడదనే తన భీష్మప్రతిజ్ఞను నెరవేర్చుకొనేందుకు సైకిలుకు అయ్యేట్టుగా డబ్బులు కూడబెట్టాడు. ఒకసారి కాదు— రెండుసార్లు. ఒకసారి భార్యకు కాన్పు కష్టమయి—మరోసారి తండ్రి కాలంచేసి— యిలా కూడబెట్టిన డబ్బుల్ని యిబ్బందులు తినేశాయి.

ఎలాగైతేనేం! తన నలభై పడిలో పడేటప్పటికి కొత్త సైకిల్ 'సెట్'గా కొన్నాడు.

హంబరు హోదాకు తగినట్టు ఇంకె ప్పుడూ చిరిగిన బట్టలు వేసుకోకూడదను అనుకొన్నాడు

ముందుసీట్లో చిన్నబ్బాయినీ, వెనకసీట్లో అర్ధాంగినీ కూచోపెట్టుకొని వెళ్ళి హాయిగా నాగేశ్వర్రావు 'సోషల్' సినిమా, ఎన్టీ రామారావు పౌరాణిక సిన్మా చూడాలను కున్నాడు.

'భార్యాభర్తలు' సిన్మాలో నాగేశ్వర్రావు కార్లో వెళ్ళినట్లు, తను సైకిల్లో 'జోరుగా హుంషారుగా షికారు పోదమా' అనుకున్నాడు.

కోరికలేమో తీరాయి. కానీ....

సైకిలు కొన్న సరిగ్గా అరవై ఆరో రోజున సాయంత్రం ఐదున్నర గంటలకు అంతర్ధానమైపోయింది.

దీనంతటికీ కారణం తనకు అనాదిగా ఉన్న ఏకైక అలవాటు—దురలవాటు.

శీతాలరోజూ. 'హోటల్ శీనూస్'లో డబుల్ స్వీటూ, సింగల్ వడా, నెస్కెఫే తినీ తాగి 'ప్రతి దినమూ శీతాల్రోజు అయితే హాయిహాయి గదా' అని లొట్టలు వేసుకుంటూ, చప్పరిస్తూ బిల్లు చెల్లించి బయటకు వేంచేశాడు గుళ్ళోంచి దేవున్లా.

బయటపెట్టిన వాహనమేదీ! కని పించదే!.... ఇటూ అటూ చూశాడు. జేబులో చెయ్యిపెట్టాడు. 'కీ' మాత్రం ఉంది, బిడ్డపోయినా పురిటికంపు పోనట్లు.

కండ్లు నులుపుకొని మరీమరీ చూసి. సైకిల్ని ఎవరో మాయంచేసినట్లు నిర్ధా రించుకొన్నాడు.

పోలీస్‌స్టేషన్‌కెళ్ళి సైకిలు నెంబరూ, గట్రా చెప్పి రిపోర్టుచేసి, కాళ్ళీడ్చుకుంటూ ఇల్లుచేరాడు. కాళ్ళే అలవాటు ప్రకారం వందు గొందుల్ని దాటించి, అతన్ని ఇల్లు చేర్చాయనడమే సబబు.

పంచకళ్యాణిపై షికారువెళ్ళి, పాద చారిగా వచ్చిన పతిని, పత్ని అడిగినట్లు "సైకిలేదీ!" అంది అర్ధాంగి. ఈ ఆరపై ఆరు దినాల్లో రెట్టింపు నిర్ధారాలయినా అతడు సైకిలుపై మరొకరి చెయ్యి పడ నివ్వలేదు అని తెలుసుగదా ఆమెకు.

అర్ధాంగి ప్రశ్నకు సమాధానం సుబ్బయ్య ఏడుపే. సుబ్బయ్య నాన్న చచ్చినపుడే ఇంత ఏడుపు ఏడ్చినాడు.

చెన్నమ్మ ఆ రాగాన్ని తానూ అందు కొని, ప్రబంధనాయికలా కలస్వనముతో గాక, మామూలు ఏడుపే ఏడిచింది.

చెన్నమ్మ ఏడుస్తూ, చీదుతూ కొంత సేపూ: ఏడవకుండా చీదకుండా కొంత సేపూ: వెరసి నూటా ఆరపై నిమిషాలు ఏకధాటిగా తిట్టిన తిట్టు తిట్టకుండా, చిన్నప్పుడు తను విన్న బూతులూ, కొలాయిలదగ్గర ప్రయోగించినవీ, నూతనంగా తను సృష్టించిన బూతులూ కల గలిపి వీధి విధంతా మార్మోగేటట్లు, ఆ 'గాలివీధి' గోలవీధి అయేట్లు తిట్టింది.

ఆమె శాపనార్ధాలు తగిలి సైకిలెత్తుకు పోయినోడి శాడు తెగలేదు. వాని ముండ 'ముదేటొంక'లో మొయ్యలేదు. వాన్ని నల్ల నాగుపాము పీకనూ లేదు. వాడు ముండాకొడుకూ, లంజకొడుకూ కానూ లేదు. వాని పెండ్లాం వానిమీదబడి చావనూ లేదు.

తనకున్న సి.యల్‌లో నాల్గుదినాలు ఏక దాటిగా సెలవుపెట్టి (ఇన్నాళ్ళు ఎప్పుడూ శలవు పెట్టలేదు, కంటిన్యుయస్‌గా ప్రతి సంవత్సరము అతని సి.యల్ మురిగి పోతూ ఉండేది) ఊరు ఊరంతా చెద తిరిగాడు. ఎవరో చిలకజోస్యంగాడు చెప్పాడని కాలికి బలపం కట్టుకొని తిరి గాడు. అయినా ఎంతకూ కన్పించని 'కల్కి' అవతారంలా సైకిల్ కనిపించనే లేదు.

తను ఉమ్మడి సైకిలు దొరుకుతుందన్న ఆశలు పోగొట్టుకున్న సుబ్బయ్య దంప తులు రెండ్రోజులు పూర్తి పస్తులూ, మూడ్రోజులు ఆర పస్తులూ ఉండి, ఆస్పత్రికి, ఆ దారినే స్మశానానికి వెళ్లాల్సి వస్తుందేమోనని భయపడి 'నార్మల్ లైఫ్'లోకి వచ్చేశారు. బాధను శరీరం నుండి మనసుకు 'ట్రాన్స్‌ఫర్' చేసి.

* * *

అప్పయ్య అనంతపురంలో హెడ్ కానిస్టేబులు. అతను సుబ్బయ్యకు మొదట దూరబ్బంధువు. ఇతని ఏకైక సోదరిని చేబట్టి క్రిష్ణుడికి అర్జునుడ్లా 'బావమరిది' అయ్యాడు.

"వాన్నాళ్ళయి వచ్చి పోరాదా ఒక సారి" అని చెల్లెలూ, బావమరిదీ జాబు

ప్రాసేటప్పటికి, గాలి మార్పులా ఉంటుందని (తిరుగు టికెట్టు ఎట్లాగూ వాళ్లే కొనిస్తారు) 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' ఎక్కి, అనంతపురం వెళ్ళి పోలీస్ క్వార్టర్స్ చేరాడు.

తలుపుతెరవంగానే సుబ్బయ్య కళ్ళల్లో పడింది, ఎదలో జల్లులూ, ఎదపై రోమాచం కల్గించిందీ, ట్యూబులైటు వెలుగులో తళతళ్ళాడే నల్లనాగుబాము లాటి 'హంబరు' సైకిలే

"హల్లో! బావా! అంతా బాగుందారా?" భుజంతట్టి పలకరించిన అప్పయ్యకు సమాధానం

"ఈ సైకిలు ఎప్పుడు కొన్నావ్?"

"ఈ మధ్యనే తెచ్చాలే."

"అచ్చం నా సైకిలూ ఇలాగే ఉండేది" స్వగతంలో సుబ్బయ్య.

* * *

"రెండ్రోజులు ఉండిపోదాంలే" అనుకొన్న సుబ్బయ్య మర్రోజే బయల్దేరాడు. అతను ఎదురుగా ఆ సైకిల్ని చూడలేకపోతున్నాడు.

ఉదయం పదిన్నర గంటలకు ఆదోని-తిరుపతి ఎక్స్‌ప్రెస్ బస్సెక్కి వెళ్తానన్నాడు సుబ్బయ్య. తొమ్మిదిన్నరకే భోజనం సిద్ధమయింది.

చానాళ్ళ తర్వాత వచ్చిన అన్నకు సోదరి సుగుణమ్మ తిరగబోతన్నం, కోడి మాంసంకూరా చేసిపెట్టింది.

'త్రివేణి' వక్కపొడి నములుతూ 'తాజ్ మహల్' బీడీ తాగుతూ సుబ్బయ్య-

"ఒరే! బావమర్దీ! సైకిల్ కొని ఎన్నాళ్ళయింది? ఎంతయింది? చెప్పనేలేదేమిరా? నేనూ యీ మధ్యనే యిట్లాంటి హంబరే కొని పోగొట్టుకొన్నా. దాన్నెంబరు H 368782 లే. అంతా నా ఖర్మ. ముచ్చటగా మూడోనెలైనా తిరగలేదు."


"ఈ సైకిలా? కొన్లేదు. చిన్న ఓపెన్ సీక్రెటు-ఎవర్తోనూ అనొద్దు. దొంగలచేత పట్టుకొన్న సైకిళ్ళు కొన్ని పోలీస్ స్టేషన్లో పడుంటే మా సీ.ఐగారు నా 'ఒబీడియన్స్'కు మెచ్చి దీన్నిచ్చారు."

అప్పయ్య మాటలు పూర్తికానివ్వకుండానే, తన సైకిలుకూడా యిట్లాగే మరో పోలీసుకు దత్తమై ఉండొచ్చునన్న ఊహ సుబ్బయ్య ఎదలోపలి ఎదలో మెదిలిందేమో...

"ఒరే! అప్పిగా! మీరు రక్షకభటులు గాదురా! భక్షక భటాచోరులు. ఊరోళ్ళ సొమ్ముకు ఒక్కపొద్దుండేవాళ్ళురా మీరు.

పచ్చని పైరులాంటి అమాయక జీవులురా ప్రజలు. వాళ్ళు చీమల్లా కూడబెట్టుకున్న సొమ్ముకు కాపలాదార్లురా మీరు? కంచే చేనుమేస్తే కాపెవ్వరురా పైరుకు?

మీకన్నా పోలీసుకుక్కలే నయంరా! అవి దొంగల్ని పట్టిస్తాయి. మీరూ దొంగల్ని పట్టుకుంటారు. అవి ఎంగిలి కూడు గతకవు. మీరు గతుకుతారు. పూర్వం దొంగలూ, దొంగలూ కలిసి ఊర్లు పంచుకొనేవాళ్ళు. ఇప్పుడు




దొంగలూ, పోలీసులూ కలిసి పంచుకొంటున్నారు. అంతేరా భేదం.

పోలీసు డిపార్టుమెంటులో అవినీతి ఎంతలా పేరుకుపోయిందో నాకు తెలీక కాదు. కానీ.... నువ్వుకూడా యిలాటి తుచ్ఛమైన పనికి దిగజారావనుకోలేదు ఊరోళ్ళ సైకిలు తెచ్చుకొని రాజాలా తొక్కుతున్నావే? ఆ సైకిల్ కొత్త సైకిలే! ఆ సైకిలోనరు దాన్ని వారం తినాలన్నా వాడినాడో లేదో?

వాళ్ళ వాలాటి బతకలేని బడిపంతులో! పొద్దున్నే సైకిల్లో యిల్లిల్లూ తిరిగి పేపరు అమ్ముకొనే పేపరబ్బాయో!! ఆఫీసరుకు ఇంటా—బయటా అరవచాకిరీ చేసే ఆఫీసు బాయో.! ఎవరికి తెలుసు? వాళ్ళ ఉసురు నీకు తగలదట్రా...."

నవ్వుల జాబిల్లి, మేనమామ మనసు తెలిసిన ఎనిదేండ్ల పిల్ల మల్లి స్టీలు పళ్ళెన్ని 'బెల్' లాగా 'టంగ్‌టంగ్'మని నాలుగుసార్లు కొట్టింది. బడిపంతులు సుబ్బయ్య అలవాటు ప్రకారం ఉపన్యాసాన్ని ఆపేశాడు.

"అరెరే! టైం అయిపోయింది బస్సుకు" అని 'టివ్‌బ్యాగ్' పుచ్చుకొని బయల్దేరాడు సుబ్బయ్య. "డబుల్స్ పోదాం సైకిల్లో" అంటే వసేమి?? "నేనెక్కను ఆ సైకిలు" అని రిక్షా ఎక్కాడు సుబ్బయ్య.

తిరుపతి బస్ ఎక్కిన తర్వాత, అప్పయ్య అటువెళ్ళి పూలూ, పండ్లూ పట్టుకొచ్చి బస్ స్టార్టయే వేళకు వచ్చి

"విష్ యూ హ్యాపీ జర్నీ" అని చెయ్యి ఊపి,

"సైకిల్ బస్‌టాప్‌మీద వేయించాను. ఇదిగో బస్ టిక్కెట్టూ, లగేజీ టిక్కెట్టూ, సైకిలు 'కీ'". అందించాడు.

"ఆ దొంగసొమ్ము నా కెందుకు?" ముఖం కందగడ్డ చేసుకున్నాడు సుబ్బయ్య.

"ఆ సైకిలు నీదే."

మిగతా మాటలు బస్ స్టార్టయిన శబ్దంలో కలిసిపోయాయి.

—౦—